ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 తమిళనాడు
TAMILNADU
శనివారం 27 జూలై 2024



తమిళనాడు హౌస్ భవనానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి

ఢిల్లీలో రూ.257 కోట్లతో
తమిళనాడు హౌస్

● ఆన్‌లైన్‌లో సీఎం స్టాలిన్ శంకుస్థాపన

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): దేశరాజధాని ఢిల్లీ చాణక్యపురి ప్రాంతంలో కొత్తగా తమిళనాడు హౌస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శ్రీకారం చుట్టారు. చెన్నై సచివాలయం నుంచి శుక్రవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రూ.257 కోట్ల వ్యయంతో నిర్మించనున్న భవన సముదాయానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఢిల్లీలో ప్రస్తుతమున్న తమిళనాడు హౌస్ భవనం పటిష్ఠతపై అధికారులతో 2021 జూన్ 18న స్టాలిన్ సమగ్రంగా చర్చించారు. ఆ ప్రాంతం భూకంపాలకు సంబంధించి ఫోర్త్ జోన్ ఉందని, ప్రస్తుతమున్న భవన సముదాయాన్ని కూల్చి అక్కడ భూకంపాలను తట్టుకునే రీతిలో కొత్త తమిళనాడు హౌస్ నిర్మించాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం కొత్త తమిళనాడు హౌస్ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు, నమూనా ప్లాన్ రూపొందించారు. కొత్త తమిళనాడు హౌస్ నిర్మాణానికి ఢిల్లీ ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు కూడా లభించాయి. భారత సాంకేతిక సంస్థ, ఐఐటీ మద్రాస్ నిపుణుల ద్వారా అన్ని పరిశీలించిన మీదట భూకంపాలను తట్టుకుని నిలబడేలా భవన నిర్మాణ ప్రణాళిక సిద్ధమైన విషయం తెలిసిందే. రూ.257 కోట్ల మేర నిధులు కూడా విడుదలయ్యాయి. శంకుస్థాపన అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఈ తమిళనాడు హౌస్ పునర్నిర్మాణ పథకం ద్వారా కొత్త భవనసముదాయంలో వీవీఐపీ బ్లాక్, గెస్ట్ బ్లాక్, ఆఫీసర్స్ క్వార్టర్స్ బ్లాక్ ఉంటాయని తెలిపారు. ఈ భవనం దిగువ మూడు ఫ్లోర్స్ నిర్మిస్తామని దిగువ అంతస్థు నుంచి ఏడు అంతస్థులుంటాయని ఆయన వివరించారు. అంతేకాకుండా వీవీఐపీల గదులు, 30 వీఐపీల గదులు, 60 డీలక్స్ గదులు, 77 పడకల డార్మెట్రీలు, మల్టీపర్పస్ హాలు, మూడు భోజనశాలలు, వెయిటింగ్ రూమ్‌లు, వ్యాయామ కేంద్రం, బిజినెస్ మాల్, లైబ్రరీ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, ఈవీ వేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ప్రజాపనుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి మంగత్‌రామ్ శర్మ, కార్యదర్శి రీటా హరీష్ టక్కర్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీలో ఎంపీలు టీఆర్ బాలు, ఎ.రాజా, తిరుచ్చి శివా, తొల్ తిరుమావళవన్, మాణిక్కం ఠాకూర్, జ్యోతిమణి, కే వెంకటేశన్, దురై వైగో, వై.సెల్వరాజ్, ఢిల్లీ తమిళనాడు హౌస్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆశిష్ చటర్జీ తదితరులు హాజరయ్యారు.



22న అమెరికాకు స్టాలిన్...

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆగస్టు 22న అమెరికా వెళ్ళనున్నారు. ఈ నెల నాలుగోవారంలో ఆయన అమెరికా వెళ్ళాలని నిర్ణయించినా, వివిధ కారణాల వల్ల ఆ పర్యటన వాయిదా పడుతూ వచ్చింది.



స్వాతంత్ర్య దినోత్సవం తర్వాత అమెరికా వెళ్ళాలని ఆయన భావించారు. ఈ నేపథ్యంలో స్టాలిన్ అమెరికా పర్యటకు కేంద్ర ప్రభుత్వం శుక్రవారం అనుమతి మంజూరు చేసింది. ఆ ప్రకారం ఆయన ఆగస్టు 22న అమెరికా బయలుదేరి వెళ్ళనున్నారు. 15 రోజులపాటు పర్యటించేందుకుగాను స్టాలిన్‌కు కేంద్రం అనుమతిచ్చినట్లు తెలుస్తోంది. స్టాలిన్‌తోపాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్బీ రాజా ఇతర అధికారులు వెళ్లనున్నారు. అమెరికా పర్యటనలో గూగుల్ సంస్థ అధినేత సుందర్‌పిచ్చై తదితర పారిశ్రామికవేత్తలతో స్టాలిన్ భేటీ అవుతారు.

పెనుగాలులు...
వణికిపోతున్న జనాలు

● నీలగిరి జిల్లాలో ఆగని వర్షాలు

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో నైరుతి రుతుపవనాలు తీవ్రరూపం దాల్చాయి. పది రోజులకు పైగా నీలగిరి జిల్లా అంతటా పెనుగాలులతో కుండపోత వర్షాలు కురిశాయి. ఊటీ, మంజూరు, గూడలూరు, పందలూరు, కుందా, కున్నూరు తదితర ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. దీని కారణంగా పలుచోట్ల రహదారులపై చెట్లు, మట్టి పెళ్లలు, బండరాళ్లు పడిపోయాయి. మూడు రోజులుగా వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టినా జిల్లా అంతటా పెనుగాలులు ఆగడం లేదు. గురువారం రాత్రి నుంచి చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం శుక్రవారం వేకువజామునాటికి కుండపోతగా మారింది. గురువారం ఊటీ చుట్టుపక్కల భారీ వర్షాలు కురిశాయి. దానికి తోడు పెనుగాలులు వీయడంతో పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలకొరిగాయి. ఊటీ నుంచి ఇత్తలార్‌కు వెళ్లే రహదారిలో ముళ్లికొర్రై అనే చోట ఓ పెద్ద వృక్షం కూలిపడింది. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అగ్నిమాపక సిబ్బంది కూలిన చెట్లను తొలగించిన మీదటే ఆ మార్గంలో వాహనాల రాకపోకలు మళ్ళీ ప్రారంభమయ్యాయి. కున్నూరు-ఊటీ మార్గంలోని ఎంజీ కాలనీ ప్రాంతంలో పార్కింగ్ చేసిన కారుపై ఓ చెట్టు కూలింది. కొటేరి, పొంగల్ మట్టమ్, కైకాట్టి, కున్నకంబై, అదికరట్టి, కుందా ప్రాంతాల్లో జనావాస ప్రాంతాల్లో ఏడు చోట్ల విద్యుత్ స్తంభాలపై చెట్లు కూలిపడ్డాయి. వర్షంతోపాటు చలిగాలులు కూడా తోడవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాల కారణంగా ఊటీకి వచ్చే పర్యాటకుల సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది. నీలగిరి జిల్లాలో పెనుగాలులు వీస్తుండటంతో ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ఊటీ, కుందా తాలూకాల్లో పాఠశాలలకు జిల్లా కలెక్టర్ లక్ష్మీభవ్య సెలవు ప్రకటించారు. జిల్లాలో అధికపక్షంగా అవలాంచిలో 20 సెం.మీల వర్షపాతం నమోదైంది. సేరంగోడులో 98, పందలూరులో 70, గూడలూరులో 61, అప్పర్ గూడలూరులో 60, దేవలాలో 57, ఒవేలిలో 42,మీ.మీ.ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు ప్రకటించారు.


బిల్లూరు డ్యాం నుంచి విడుదలవుతున్న జలాలు


ఊటీ ఎంజీ కాలనీ వద్ద కారుపై కూలిన వృక్షం. రహదారిలో మంచులో వెళుతున్న వాహనం


నిండిన బిల్లూరు డ్యామ్...

నీలగిరి జిల్లాలో పది రోజులుగా కురిసిన కుండపోత వర్షాలకు కోవై జిల్లా మేట్టుపాళయం సమీపంలోని బిల్లూరు డ్యామ్ నీటిమట్టం పూర్తి స్థాయికి చేరుకుంది. గత కొద్ది రోజులుగా ఆ డ్యాం పరీవాహ ప్రాంతాల్లోనూ భారీగా వర్షాలు కురవటంతో డ్యాంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఆ డ్యాం పరీవాహక పాంతాలైన నీలగిరి జిల్లా అప్పర్ భవానీ, అవాలంచి, కుందా, కేరళలోని అట్టప్పాడి మన్నార్‌కాడు తదితర ప్రాంతాల్లోనూ ప్రస్తుతం భారీగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం ఉదయం ఆ డ్యాంలోకి సెకనుకు సుమారు 20 వేలఘనపుటడుగుల మేర నీరు వస్తున్నట్టు నీటివనరుల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.


ఊటీ చర్చి ప్రాంతంలో కురుస్తున్న వర్షం

20 రోజుల్లో
200మంది రౌడీల అరెస్టు

● 2వేలమంది పోలీసులతో వేట



అడయార్, జూలై 26: చెన్నై మహానగరంలో బీఎస్పీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ దారుణ హత్య తర్వాత రౌడీలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఫలితంగా గడిచిన 20 రోజుల్లో ఏకంగా 200 మంది రౌడీలను అరెస్టు చేశారు. పైగా నగరంలోనే కాకుండా, ఇతర ప్రాంతాల్లో ఉన్న రౌడీల కోసం 2 వేల మంది పోలీసులతో గాలిస్తున్నారు. దీంతో రౌడీలతో పాటు సంఘ విద్రోహశక్తులు వణిపోతున్నారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో ఇప్పటివరకు 17 మందిని పోలీసులు అరెస్టు చేయగా, ఈ కేసుతో సంబంధం ఉన్న మరికొందరి కోసం వేట కొనసాగిస్తున్నారు. చెన్నై నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ఉన్న రౌడీల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. పోలీస్ కమిషనర్ అరుణ్ ఆదేశం మేరకు సుమారు రెండు వేల మంది పోలీసులతో రౌడీల కోసం గాలిస్తున్నారు. అదేవిధంగా నగరంలోని పోలీస్ స్టేషన్ రికార్డుల కెక్కిన 104 మంది పేరుమోసిన రౌడీలతో పాటు కొత్తగా రౌడీలుగా చెలామణి అవుతున్న వారిని గుర్తించి అరెస్టు చేసేపనిలో నిమగ్నమైవున్నారు. ఈ చర్యల్లో భాగంగా గత 20 రోజుల్లో ఏకంగా 200 మందిని పోలీసులు అరెస్టుచేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రికార్డులకెక్కిన రౌడీల ఆచూకీ కోసం ఎస్ఐ నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం.. రౌడీలు ఎక్కడెక్కడకు వెళుతున్నారు? ఏం చేస్తున్నారు? వారి కదలికలు? తదితర అంశాలపై నిఘా సారించింది. ఈ ఎస్ఐ సారథ్యంలోని బృందాల పనితీరు ఆయనా పోలీస్ స్టేషన్ సీఐలు నిశితంగా పర్యవేక్షించేలా కమిషనర్ అరుణ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిఘా కళ్ళుగప్పి రౌడీలు దుశ్చర్యలకు పాల్పడితే ఇన్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటివరకు అరెస్టు చేసిన 400 మంది రౌడీలను ఆయా ప్రాంతాల్లోని జైళ్ళకు తరలించారు. మరికొందరు రౌడీల నుంచి సత్ప్రవర్తనతో మెలుగుతామంటూ స్వీయ దస్తూరితో అఫిడవిట్ రాయించుకుని వదిలి పెట్టారు.



మెరీనా బీచ్ రోడ్డులోని వార్ మెమోరియల్ స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

కార్గిల్ వీరులకు నివాళి

ప్యారీస్, జూలై 26: కార్గిల్ విజయ్ దివస్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ రాష్ట్రవ్యాప్తంగా మిలిటరీ అధికారులు, జవాన్లు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. కార్గిల్ పోరులో అమరులైన రియల్ హీరోలను స్మరిస్తూ విజయ్ దివస్‌గా జరుపుకొని అమరులకు నివాళులర్పించడం ఆనవాయితీగా సాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది విజయ్ దివస్ 25వ వార్షికోత్సవం సందర్భంగా మెరీనా బీచ్ రోడ్డు వార్ మెమోరియల్ ప్రాంగణంలో ఉన్న అమర జవాన్ల స్మారక స్థూపం వద్ద గవర్నర్ ఆర్ఎన్ రవి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అదే విధంగా సైనికాధికారులు కూడా ఘననివాళులర్పించారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి: సీఎం స్టాలిన్

కార్గిల్ పోరులో విజయం సాధించిన భారత జవాన్ల ధైర్యసాహసాలను గుర్తుచేసుకొని ఘననివాళులర్పిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేశారు. దేశాన్ని కాపాడిన అమరుల త్యాగాలను మరచి పోరాదని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా పనిమయమాత ఆలయ వేడుకలు

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడిలోని సుప్రసిద్ధ పవిత్ర పనిమయ మాత ఆలయ 442వ వార్షిక వేడుకలు శుక్రవారం ఉదయం పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలను పురస్కరించుకుని వేకువ జాము 5 గంటల నుండి తిరుబలి, 5.45 గంటలకు ద్వితీయ ఆరాధన నిర్వహించారు. తర్వాత తూత్తుకుడి ఆర్చి బిషప్ స్టీఫెన్ నాయకత్వంలో ఉదయం 7 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు, 8.30 గంటలకు ధ్వజస్తంభంపై పతకాన్ని ఆవిష్కరించారు. ఆ సమయంలో తూత్తుకుడి పాత ఓడరేవులో నిలిపిన నౌక సైరన్ మోగించారు. నలువైపులా శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ వేడుకలలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గీతా జీవన్, జిల్లా కలెక్టర్ లక్ష్మీపతి, డీఎస్పీ బాలాజీ శరవణన్, తూత్తుకుడి మహానగర మేయర్ జగన్ పెరియసామి తదితరులు హాజరయ్యారు. ఈ వేడుకల్లో వివిధ జిల్లాలకు చెందిన వేలాదిమంది క్రైస్తవులు పాల్గొన్నారు. మధ్యాహ్నం మాజీ క్రైస్తవ మతబోధకుడు కుమార రాజా నాయకత్వంలో పనిమయ మాతాదేవికి స్వర్ణకిరీట ధారణవైభవంగా జరిగింది. ఈ నెల ఐదున రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఆ వేడుకలకు శ్రీలంక, సింగపూరు తదితర దేశాల భక్తులు కూడా పాల్గొననున్నారు. పోర్చుగీసువారు నిర్మించిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచి ఈ ఆలయం సుమారు 1500 యేళ్లనాటిదని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. ప్రతియేటా ఈ దివ్యక్షేత్రంలో పది రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ ఆలయ వేడుకలను జాతి మత కులాలకు అతీతంగా అన్ని కులాలకు చెందినవారు కలిసికట్టుగా నిర్వహించడం విశేషం. ఈ వేడుకలలో ప్రపంచ శాంతి, సమైక్యత, విద్యార్థుల ఉత్తీర్ణత కోసం, వ్యాపారులు, మత్స్యకారులు, తాటి కార్మికులు, ఉప్పుకయ్యలలో పనిచేసే కార్మికులు తదితరుల సుఖశాంతులను ఆశిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. శుక్రవారం ఉదయం నిర్వహించిన పతాకావిష్కరణకు హాజరైన సుమారు ఐదువేలమంది భక్తులకు ఇద్దరు ఏఎస్పీలు, ఐదుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 15 మంది ఎస్ఐలు, 900 మంది కానిస్టేబుళ్ల పటిష్ఠమైన భద్రత కల్పించారు. నలుమూలలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోలు రూమ్‌లో పోలీసు అధికారులు పరిశీలించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని తూత్తుకుడి జిల్లా వ్యాప్తంగా మత్స్యకారులు చేపలవేటకు సెలవు ప్రకటించారు.




ఆలయం వద్ద పతాకావిష్కరణకు హాజరైన భక్తులు , పాల్గొన్న మంత్రి గీతాజీవన్, అధికారులు

కడలూరు-తిరుప్పూర్ నాయకులతో
ఈపీఎస్ సమీక్ష

ప్యారీస్, జూలై 26: సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై అన్నాడీఎంకే పార్లమెంటు నియోజకవర్గాల ఇన్‌చార్జులు, పోటీచేసిన అభ్యర్థులతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నిర్వహిస్తున్న సమీక్షలో భాగంగా శుక్రవారం కడలూరు, తిరుప్పూర్ ప్రాంతాల నేతలు పాల్గొన్నారు. రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో ఈ నెల 10వ తేది నుంచి 19 వరకు 8 రోజులు జరిగిన సమీక్షలో సంబంధిత నియోజకవర్గాల ఇన్‌చార్జులు, నిర్వాహకులు పాల్గొని ఎన్నికల్లో ఓటమికి గల కారణాలపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. రెండో విడత సమీక్ష ఈ నెల 24న ప్రారంభమైంది. శుక్రవారం సమావేశం ప్రారంభమైన సమయంలో అన్నాడీఎంకే నుంచి వైదొలిగిన మాజీ నేత చిన్నస్వామి ఈపీఎస్ సమక్షంలో మళ్లీ పార్టీలో చేరగా, ఆయనను సీనియర్ నాయకులు సాదరంగా ఆహ్వానించారు. సమావేశంలో పార్టీ ప్రిసీడియం ఛైర్మెన్ తమిళ్‌మగన్ హుస్సేన్, మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్, మాజీ మంత్రులు కేపీ మునుస్వామి, నత్తం విశ్వనాథన్, ఎస్పీ వేలుమణి, దిండుగల్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.


ఈపీఎస్‌కు నివేదిక సమర్పిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్

ఆస్కా ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రముఖులు

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మైలాపూర్‌లోని కేసరి తెలుగు మహోన్నత పాఠశాల విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాల వితరణ జరిగింది. ఆస్కా ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ పి.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఆదినారాయణరెడ్డి, కోశాధికారి కోటేశ్వరరావు, సభ్యులు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించిన అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. గత 14 సంవత్సరాలుగా తెలుగు విద్యార్థుల అభివృద్ధికి ఆస్కా ట్రస్టు తరఫున చేయూతనందిస్తున్నామని తెలిపారు. నగరంలోపి తెలుగు పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు కాకుండా స్కాలర్‌షిప్ కూడా అందిస్తున్నామన్నారు. 2024-25 సంవత్సరానికి నగరంలో వున్న తెలుగు పాఠశాలలకు సుమారు రూ.6 లక్షల విలువైన నోటు పుస్తకాలతో పాటు మొదటి విడతగా రూ.5 లక్షల మొత్తాన్ని స్కాలర్‌షిప్‌లుగా తెలుగు విద్యార్థులకు అందిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తున్నందున వారిని మరింత ప్రోత్సహించేలా ఆస్కా ట్రస్ట్ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ట్రస్టు నిర్వాహకులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీతాంజలి బృందం శాలువలతో సత్కరించారు.

సమాచార దర్శిని

అంతరిక్ష దినం జరుపుకోండి

ఐసిఎఫ్, జూలై 26: చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని పంపిన విజయాన్ని జ్ఞాపకం చేసుకొనేలా ఆగస్టు 23వ తేది జాతీయ అంతరిక్ష దినం జరుపుకోవాలని విశ్వవిద్యాలయాలకు యూజీసీ ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, అంతరిక్ష దినం మొదటి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో జరుగనున్నాయి. ఈ సందర్భంగా వివిధ రకాల పోటీలు విద్యార్థులకు నిర్వహించనున్నారు. భారత అంతరిక్ష సాధనాలకు సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉన్నత విద్యాసంస్థలకు యూజీసీ సూచించింది.

జనవరిలో పరందూర్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు

ఐసిఎఫ్, జూలై 26: కాంచీపురం జిల్లా పరందూర్‌లో చెన్నై రెండో విమానాశ్రయ నిర్మాణపనులు 2026 జనవరిలో ప్రారంభించనున్నట్లు టిడ్కో సంస్థ తెలిపింది. మీనంబాక్కంలో ఉన్న విమానాశ్రయానికి వచ్చే ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో రెండో విమానాశ్రయాన్ని పరందూర్‌లో ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. రూ.29,150 కోట్లతో చేపట్టనున్న విమానాశ్రయ పనుల్లో ప్రాథమిక దశ పనులను 2026 జనవరిలో ప్రారంభించి 2028 డిసెంబరులో ముగించనున్నామని అధికారులు తెలిపా రు. అలాగే, రెండో విడత పనులు 2033లో ప్రారంభించి 2025, మూడో విడత పనులు 2044లో ప్రారంభించి 2046లో చేపట్టనున్నారు.

వీణ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్యారీస్, జూలై 26: నగరంలోని విద్యారంభ జ్ఞాన మహాసరస్వతి ఆలయం, జై సరస్వతి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆగస్టు 24న నిర్వహించనున్న వీణ పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈ నెల 31వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. టి.నగర్ జీఎన్ శెట్టి రోడ్డులోని సర్ పిట్టి త్యాగరాయ ఆడిటోరియం వేదికగా ఆగస్టు 24వ తేది ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు సరస్వతి నమస్తుతి ఆడియో రిలీజ్, ఫండ్ రైజింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వీణానాదం పేరుతో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనదలచిన కళాకారులు ఈ నెలాఖరులోపు తమ పేర్లను 9380124747 అనే నెంబరులో నమోదుచేసుకోవాల్సిందిగా ట్రస్టీ పీవీ కృష్ణారావు, గురుస్వామి భక్తవత్సలంలు తెలిపారు.

ఇరుంబులియూర్‌లో రెడీమేడ్ సబ్ వే

ఐసిఎఫ్, జూలై 26: తాంబరం సమీపంలోని ఇరుంబులియూర్‌లో రెడీమేడ్ సబ్‌వే ఏర్పాటుచేస్తున్నారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన ఇరుంబులియూర్ వంతెన చిన్నది కావడంతో పీక్ అవర్‌లో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఈ సమస్యను పరిష్కరించేలా కి.మీ మేర రహదారి విస్తరణ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. రోడ్డుకు 195 అడుగుల సబ్‌వే ఏర్పాటుచేస్తున్నారు. ప్రీ కాస్ట్ అనే రెడీమేడ్ కాంక్రీట్ బాక్స్‌లతో ఈ సబ్‌వే నిర్మాణపనులు 50 శాతం ముగిశాయి. 2025లో సబ్ వే అందుబాటులోకి వస్తుందని జాతీ య రహదారుల శాఖ అధికారులు తెలిపారు.

పూందమల్లిలో 45 ఎకరాల్లో మెట్రో యార్డ్

ఐసిఎఫ్, జూలై 26: స్థానిక పూందమల్లిలో రూ.187 కోట్లతో 45 ఎకరాల్లో మెట్రో యార్డ్ నిర్మాణపనులు జరుగుతున్నాయి. నగరంలో రెండో విడతగా పూందమల్లి-లైట్ హౌస్ వరకు 326 కి.మీ దూరం మెట్రోరైలు మార్గం నిర్మాణపనులు జరుగుతున్నాయి. పూందమల్లి బైపాస్ నుంచి కోడంబాక్కం పవర్ హౌస్ వరకు ఫ్లై ఓవర్, కోడంబాక్కం ఫ్లై ఓవర్ నుంచి లైట్ హౌస్ వరకు సొరంగ మార్గం సాగుతోంది. ఈ మార్గంలో 19 ఫ్లై ఓవర్ రైల్వేస్టేషన్లు, 9 సొరంగ రైల్వేస్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. మెట్రోరైళ్ల పర్యవేక్షణ, మరమ్మతులు చేపట్టేందుకు మెట్రో రైలు యార్డ్ నిర్మాణపనులు 2021లో ప్రారంభమై ముమ్మరంగా జరుగుతున్నాయి. త్వరలో ఈ పనులు పూర్తికానున్నాయని అధికారులు తెలిపారు.

29న మచ్చకారమురుగన్ ఆలయ క్షీరాభిషేకం

ఐసిఎఫ్, జూలై 26: స్థానిక వానగరం మేట్టుకుప్పంలో ఉన్న మచ్చకార స్వామినాథ బాలమురుగన్ ఆలయంలో సుబ్రమణ్యస్వామికి ఈ నెల 29వ తేది క్షీరాభిషేకం జరుగనుంది. ఈ ఆలయంలో ఉన్న మూలవిరాట్టు మురుగ పెరుమాళ్ కుడి చెంపపై ఎరుపు రంగు మచ్చ ఉంది. దీంతో స్వామివారిని మచ్చకార బాలమురుగన్ పేరుతో భక్తులు పిలుస్తుంటారు. ప్రతి సంవత్సరం ఆడికృతికకు 108 కలశాలతో క్షీరాభిషేకం నిర్వహిస్తుంటారు. ఆ ప్రకారం ఈ ఏడాది 29వ తేది మధ్యాహ్నం 12 గంటలకు క్షీరాభిషేకం జరుగనుంది.

లా కోర్సు దరఖాస్తు గడువు పొడిగింపు

ఐసిఎఫ్, జూలై 26: మూడేళ్ల ఎల్ఎల్‌బీ, హానర్స్ కోర్సుల దరఖాస్తు గడువు ఈ నెల 31 వరకు పొడిగిస్తూ తమిళనాడు డా.అంబేద్కర్ న్యాయ విశ్వవిద్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఈ విశ్వవిద్యాలయం ఆధ్వర్యం లో పనిచేసే లా కాలేజీలు, స్కూళ్లలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్‌బీ హానర్స్ కోర్సులకు ఇటీవల దరఖాస్తు స్వీకరణ ప్రారంభమైంది. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తు గడువు ఈ నెలాఖరు వరకు వర్శిటీ పొడిగించింది.

5,512 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, జూలై 26: సోలార్ విద్యుదుత్పత్తి 5,512 మెగావాట్లకు పెరిగింది. ఏడాది పొడవునా సౌరవిద్యుదుత్పత్తి జరుగుతుంది. ఇళ్లు, దుకాణాలు, కర్మాగారాల పైకప్పులపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తోంది. వాటి నుంచి లభించే విద్యుత్ స్వీయ వినియోగానికి పోగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం 5,512 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి జరిగిందని, మార్చి 5వ తేది 5,398 మెగావాట్లున్న రికార్డును బద్దలుకొట్టిందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 26: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూర్: శ్రీనివాస నగర్ 7,8 వీధులు, 8,9 క్రాస్ వీధులు, అంబత్తూర్ సిడ్కో, నార్త్ ఫేస్, సిడ్కో ఎస్టేట్, పొన్నియమ్మన్ నగర్ 10,11 వీధులు, పొన్నియమ్మన్ ఆలయ వీధి

అన్నానగర్: శాంతి కాలని, పెరియకూడల్, భారతి పురం, గజలక్ష్మి కాలని, షెనాయ్ నగర్ వెస్ట్ 1వ మెయిన్ రోడ్డు, వెస్ట్ పార్క్ రోడ్డు

అడయార్: బీసెంట్ నగర్ 1వ మెయిన్ రోడ్డు, 16 నుంచి 25 క్రాస్ వీధులు, 3వ మెయిన్ రోడ్డు, పీడబ్ల్యూడీ క్వార్టర్స్, 6వ అవెన్యూ, ఓడైకుప్పం, డిడీర్ నగర్, 7వ అవెన్యూ.

చోళవందాన్‌లో హైవే స్థలం దురాక్రమణ

● ఇళ్ళ కూల్చివేత



ఎక్సకవేటర్లతో ఇళ్ళను కూల్చివేస్తున్న కార్మికులు - పోలీసుల భద్రత నడుమ జరుగుతున్న ఇళ్ల కూల్చివేత పనులు

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా చోళవందాన్ సమీపం ముళ్ళిపల్లం గ్రామంలో రాష్ట్ర రహదారుల శాఖకు చెందిన స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన 128 ఇళ్ల కూల్చివేత పనులు శుక్రవారం ఉదయం తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల నడుమ ప్రారంభమయ్యాయి. కోర్టు ఉత్తర్వు మేరకు ఆ చోట ఇళ్లు నిర్మించుకున్నవారిని ఖాళీ చేయమంటూ అధికారులు పలుమార్లు నోటీసులిచ్చినా పట్టించుకోలేదు. దీంతో శుక్రవారం ఉదయం హైవే అధికారి రాధా ముత్తుకృష్ణన్, వాడిపట్టి తహసీల్దార్ రామచంద్రన్, సమయనల్లూరు డీఎస్పీ ఆనందరాజ్, చోళవందాన్ సీఐ సెల్వపాండి నాయకత్వంలో సుమారు 300ల మంది పోలీసులు, నాలుగు ఎక్సకవేటర్లతో అక్కడి ఇళ్లను కూల్చివేసే పనులు ప్రారంభించారు. అదే సమయంలో ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారంతా ఇళ్ళను కూల్చివేయకుండా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని బల ప్రయోగంతో అక్కడి నుంచి తొలిగించారు. నలభై యేళ్లకు పైగా ఆ స్థలంలో నివశిస్తున్న వారంతా తమ కళ్లెదుటే వాటిని కూల్చివేస్తుంటడంతో విలపించారు. ఈ సంఘటన కారణంగా ఆ ప్రాంతంలో రోజంతా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో 'గిరిజన' పదాన్ని మినహాయించాలి

● ప్రభుత్వానికి హైకోర్టు సలహా

ప్యారీస్, జూలై 26: ప్రభుత్వ విద్యా సంస్థల్లో 'గిరిజన' అనే పదాన్ని మినహాయించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మద్రాసు హైకోర్టు సలహా ఇచ్చింది. కల్తీ సారా తయారీకి ప్రసిద్ధిచెందిన కల్వరాయన్ కొండ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజన తెగల్లో ఆ వ్యాపారం నుంచి విముక్తి కలిగించి ప్రత్యామ్నాయం కల్పించి వారి జీవనశైలి మెరుగుపరిచేలా చర్యలు చేపట్టాల్సిందిగా రాష్ట్రప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేయాలని హైకోర్టు నిర్ణయించింది. సుమోటోగా ముందుకొచ్చి చేపట్టిన ఈ కేసును శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తులు ఎస్ఎం సుబ్రమణ్యం, కురప్పన్‌తో కూడిన ధర్మాసనం సమక్షంలో విచారణకు వచ్చింది. ఇందులో కల్వరాయన్ కొండ ప్రాంతంలో పదేళ్లలో 80 కి.మీ మేర రోడ్లు నిర్మించినట్లు, రూ.7.80 కోట్లతో పాఠశాల, ఆస్పత్రులు నిర్మించినట్లు ప్రభుత్వ తరపు న్యాయవాదులు వివరణ ఇచ్చారు. సహకార బ్యాంక్ ద్వారా రూ.88 కోట్లు రుణాలు అందజేశామని, రూ.1.70 కోట్లతో వీధి దీపాలు, సోలార్ దీపాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. అయితే ఆదిద్రావిడ సంక్షేమ శాఖ కార్యదర్శి ఈ మేరకు దాఖలుచేసిన నివేదిక సంతృప్తిగా లేదంటూ న్యాయమూర్తుల బెంచ్ అభిప్రాయపడింది. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన పాఠశాల, గిరిజన కళాశాల అని పిలవడానికి బదులు వాటిని కూడా ప్రభుత్వ విద్యాసంస్థలుగా పిలవొచ్చని, సాంకేతిక విజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న 21వ శతాబ్దంలో గిరిజన అనే పదాన్ని ప్రభుత్వం విద్యాసంస్థల నుంచి తొలగించాలని హైకోర్టు సలహా ఇచ్చింది. ఈ కేసు తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదావేసింది.

నేడు నగరంలో 4 చోట్ల డీఎంకే ధర్నా

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ డీఎంకే ఆధ్వర్యంలో శనివారం ఉదయం నాలుగు చోట్ల ధర్నా నిర్వహించనున్నారు. చెన్నై కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు డీఎంకే ఎంపీ దయానిధి మారన్ నాయకత్వం వహించనున్నారు. మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ కళానిధి వీరాసామి, డీఎంకే జిల్లా శాఖల నాయకులు ఆర్డీ శేఖర్, మాధవరం సుదర్శనం, ఎమ్మెల్యేలు జోసెఫ్ సామువేల్, తాయగం కవి, వెట్రిఅళగన్, ఐడ్రీమ్ మూర్తి, కేపీ శంకర్ తదితరులు పాల్గొంటారు. తాంబరం షణ్ముగంసాలైలో డీఎంకే కోశాధికారి, ఎంపీ టీఆర్‌బాలు ధర్నాకు నాయకత్వం వహిస్తారు. సైదాపేట వద్ద నిర్వహించే ధర్నాలో పార్టీ జిల్లా శాఖల నాయకులు సిట్రరసు, డి.వేలు, ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్ తదితరులు పాల్గొంటారు. ఆవడిలో జరిగే ధర్నాకు జిల్లా శాఖ కార్యదర్శి, మాజీమంత్రి ఆవడి ఎస్ఎం మస్తాన్ నాయకత్వం వహిస్తారు.

అర్ధాంతరంగా ఆగిన రోప్‌కార్

చిక్కుకున్న ముగ్గురు మహిళలు

ఐసిఎఫ్, జూలై 26: కరూర్ జిల్లా కులితలై సమీపంలోని అయ్యనార్‌మలై కొండపై ప్రారంభించిన రెండో రోజునే రోప్‌కార్ అర్ధాంతరంగా ఆగింది. అందులో ఉన్న ముగ్గురు మహిళలను రెండున్నర గంటల అనంతరం సురక్షితంగా రక్షించారు. ప్రసిద్ధిగాంచిన రత్నగిరీశ్వరాలయ అయ్యనార్ కొండపై ఉంది. స్వామివారిని దర్శించుకొనేందుకు భక్తులు 1,017 మెట్లు ఎక్కాలి. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు రోప్‌కార్‌లో ఎక్కిన ముగ్గురు మహిళలు హఠాత్తుగా ఆగిపోవడంతో భయాందోళనలకు గురయ్యారు. సుమారు రెండున్నర గంటల తరువాత వారిని కిందకు దింపారు. ఈ విషయమై బాధిత మహిళలు మాట్లాడుతూ... ఆకాశంలో వేలాడుతున్న తాము మరో జన్మ ఎత్తినట్లు భావిస్తున్నామన్నారు.

అక్టోబరు 1 నుంచి పాంబన్ వంతెనపై రైళ్ల రాకపోకలు

ఐసిఎఫ్, జూలై 26: పాంబన్ కొత్త వంతెనపై రైళ్ల సేవలు అక్టోబరు 1 నుంచి ప్రారంభించనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. రామేశ్వరం సమీపంలోని పాంబన్ పాత రైలు లిఫ్ట్ వంతెన పటిష్ఠత కోల్పోవడంతో కొత్త వంతెన నిర్మాణపనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా రామేశ్వరం-మండపం మధ్య రైళ్ల సేవలు రెండేళ్లుగా నిలిపివేశారు. ప్రస్తుతం వంతెన నిర్మాణపనులు ముగింపు దశకు చేరుకోవడంతో, అక్టోబరు 1వ తేది నుంచి రైళ్ల సేవలు ప్రారంభించనున్నట్లు దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్ తెలిపారు.

విద్యార్థులకు రూ.1,000 సాయం

● మార్గదర్శకాలు విడుదల

ప్యారీస్, జూలై 26: తమిళ్ పుదల్వన్ పథకం కింద విద్యార్థులకు ప్రతినెలా రూ.1,000 సాయం అందజేయనున్నట్లు ప్రకటించిన రాష్ట్రప్రభుత్వం, దానికి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 6 నుంచి 12వ తరగతి వరకు తమిళ మీడియం చదువుకొని ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థినులకు పుదుమై పెన్ పథకం ద్వారా ప్రతినెలా రూ.1,000 ఆర్థికసాయం జరుగుతోంది. అదే విధంగా తమిళ్ పుదల్వన్ పథకం పేరుతో విద్యార్థులకు కూడా ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతినెలా రూ.1,000 పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం రూ.360 కోట్లు కేటాయించింది. విద్యార్థులు ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొనే దరఖాస్తులు పూర్తిచేసి ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. లబ్ధిదారులు వేరే పథకం కింద ఆర్థిక సాయం పొందితే తమిళ్ పుదల్వన్ పథకానికి అనర్హులని ప్రభుత్వం తెలిపింది.

80 శాతం దంత సమస్యల బాధితులు

ఐసిఎఫ్, జూలై 26: దేశంలో మొత్తం జనాభాలో 80 శాతం మంది దంత సమస్యలతో బాధపడుతున్నట్లు భారత దంత వైద్య సంఘ గౌరవ కార్యదర్శి అశోక్ తెలిపారు. నగరంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో 3.55 లక్షల మంది దంత వైద్యులున్నప్పటికీ, వారిలో ఎక్కువగా నగరాల్లో మాత్రమే ఉన్నారని తెలిపారు. పొగాకు వాడకం వల్ల రోజుకు 8 మంది క్యాన్సర్‌తో మృతిచెందుతున్నారని తెలిపారు. మొత్తం జనాభాలో 80 నుంచి 90 శాతం మందికి దంత సంబంధిత వ్యాధులున్నాయని, మొబైల్ వాహనాల్లో అన్ని ప్రాంతాలకు దంత వైద్యు లు వెళ్లి దంత సమస్యలపై అవగాహన కల్పించి చికిత్సలందించాలని సూచించారు.

తిరుత్తణిలో ప్రత్యేక దర్శనం ధర తగ్గింపు

ఐసిఎఫ్, జూలై 26: ఆడికృతికను పురస్కరించుకొని తిరుత్తణిలో ప్రత్యేక దర్శన రుసుము రూ.100కు తగ్గించారు. తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయ ఆడికృతిక ఉత్సవాలు, డిసెంబరు 31, జనవరి 1వ తేదీల్లో జరిగే తిరుప్పడి ఉత్సవాల్లో రాష్ట్రం, పొరుగు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు. ఈ ఏడాది ఆడికృతిక ఉత్సవాలు శనివారం నుంచి 31వ తేది వరకు జరుగనున్నాయి. ఆడికృతిక, తిరుప్పడి ఉత్సవాల్లో ప్రత్యేక దర్శన రుసుము రూ.200లకు తగ్గించాలని భక్తులు విజ్ఞప్తి చేశారు. వారి కోరిక మేరకు రూ.100కు తగ్గిస్తూ దేవాదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు ఉత్తర్వులు జారీచేశారు.

10 మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

మంగళం, జూలై 26: టాస్క్‌ఫోర్స్ పోలీసులు పది మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆరు దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ అధ్వర్యంలో ఆర్ఐ కె.కృపానంద, ఆర్ఎస్ఐ కె.సురేష్ బాబుకు చెందిన బృందం దొరవారిసత్రం-నాయుడుపేట అటవీ ప్రాంతంవైపు శుక్రవారం కూంబింగ్ చేపట్టారు. అక్కడినుంచి సూళ్లూరుపేట బీటు పరిధిలోని తల్లంపాడు గ్రామం సమీపంలో ఉన్న జాతీయ రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అటువైపు వచ్చిన రెండు కార్లు వీరిని చూసి కొద్దిదూరంలోనే ఆపేసి, అందులోని వారు పారిపోయే ప్రయత్నం చేయగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంబడించి పది మంది పట్టుకున్నారు. వీరు.. తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన రాజమణి గోవిందస్వామి (41), విజయకుమార్ (32), శివకుమార్ వెల్లియన్ (26), కుమార్ ముత్తు (29), అరుల్ ముత్తుస్వామి (23), ప్రభు రాజి (25), అశోక్ కుమార్ (29), ఎం.గోపి (26), జ్ఞానశేఖర్ చిన్నతంబి (19), పూవరాసన్ వరదన్ (27)గా గుర్తించారు.

29 నుంచి విద్యార్థులకు యూనిఫాం, పాదరక్షల పంపిణీ

ప్యారీస్, జూలై 26: రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 29 నుంచి యూనిఫాం, పాదరక్షలు పంపిణీ చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. వేసవి సెలవుల అనంతరం 2024-25వ విద్యా సంవత్సరంలో పాఠశాలలు పునఃప్రారంభించి 40 రోజులు గడిచిన నేపథ్యంలో ఆగస్టులోగా విద్యార్థులకు యూనిఫాం, పాదరక్షలు, బ్యాగులు, ఇతర విద్యాసామగ్రి పంపిణీ పూర్తిచేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

మంత్రి పొన్ముడి ఆస్తుల స్తంభన

● ఈడీ చర్యలు

ప్యారీస్, జూలై 26: ఎర్రమట్టి క్వారీ అవినీతి కేసులో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడికి చెందిన రూ.14.20 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈడీ) అధికారులు శుక్రవారం స్తంభింపజేశారు. 2016వ సంవత్సరం డీఎంకే ప్రభుత్వ హయాంలో విల్లుపురం జిల్లా వానూరు మండలం కూత్తురై గ్రామంలో ఎర్రమట్టి క్వారీని వేలంలో పొంది మోతాదుకు మించి మట్టి తవ్వకాలు జరిపినందువల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లిందని ఆ సమయంలో మంత్రిగా వ్యవహరించిన పొన్ముడి, ఆయన భార్య, కుమారులపై ఫిర్యాదులు రావడంతో ఈడీ అధికారులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. ఈ కేసులో ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి, ఆయన కుమారుడు గౌతమ్ శిఖామణిలకు సంబంధించిన రూ.14.21 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను స్తంభింపజేసినట్లు ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటించారు.

11 రోజుల టీ, కాఫీ ఖర్చు రూ.27 లక్షలు

● కోవై కార్పొరేషన్ లెక్కలపై విమర్శలు

ప్యారీస్, జూలై 26: కోవై వెళ్లలూరు డంపింగ్ యార్డులో ఏప్రిల్‌లో సంభవించిన అగ్నిప్రమాదంలో మంటలు ఆర్పేందుకు అయిన ఖర్చు వివరాలు శుక్రవారం విడుదలయ్యాయి. అందులో, మొత్తం ఖర్చు రూ.76,70,318 అని, టీ, కాఫీ, భోజనం కోసం రూ.27,51,678 అని ఉంది. కోవై కార్పొరేషన్ పరిధిలో ఉన్న వంద వార్డుల్లో సేకరించిన చెత్తను వెళ్లలూరు డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. అక్కడ ఏప్రిల్ 6 నుంచి 17వ తేది వరకు మంటలు వ్యాపించగా, హెలికాప్టర్, ఫైరింజన్ల ద్వారా మంటలు అదుపుచేశారు. ఈ ఖర్చుల వివరాలు వెల్లడైన నేపథ్యంలో, టీ, కాఫీకి మాత్రం రూ.27 లక్షలు ఖర్చుచేయడం దారుణమని విపక్ష కౌన్సిలర్లు విమర్శించారు.

పోలీస్‌బూత్, టాస్మాక్‌పై బాంబులతో దాడి

● రౌడీ అరెస్టు

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ అన్నై సత్యానగర్‌లో పోలీస్ బూత్, టాస్మాక్ దుకాణంపై పెట్రోలు బాంబులతో దాడి చేసిన అదే ప్రాంతానికి చెందిన రౌడీ బాలా అలియాస్ బాలన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బాలా తరచూ తిరుచ్చి వెళ్ళి అతడి తల్లితో ఉండేవాడు. చెన్నైకి వచ్చి నేరాలకు పాల్పడేవాడు. ఇతడిపై పలు పోలీసుస్టేషన్లలో కేసులున్నాయి. బాంబు దాడి గురించి పోలీసులు అతడిని విచారణ జరిపినప్పుడు జైల్లో ఉంటేనే తన ప్రాణాలకు ముప్పువాటిల్లదని భావించే ఉద్దేశపూర్వకంగానే బాంబులతో దాడి జరిపి అరెస్టయ్యానని చెప్పాడు.

ఇన్‌స్టాగ్రామ్ స్నేహం తెచ్చిన గండం

● అశ్లీల చిత్రం విడుదల చేస్తానని యువకుడి బెదిరింపు

● భయంతో విద్యార్థిని ఆత్మహత్య

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాలిగ్రామం ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని ఇన్‌స్టాగ్రామ్ స్నేహితుడి బెదిరింపులకు భయపడి ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా వున్నాయి... నగరంలోని ఓ ప్రాంతంలో నివసిస్తున్న బాలిక బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో పలువురితో ఛాటింగ్ చేసిన సమయంలో ఓ యువకుడు పరిచయమై రోజూ ఆమెతో చాట్ చేసేవాడు. అతడు అడిగిన భంగిమలో ఆ విద్యార్థిని తన ఫొటోలను కూడా పంపింది. కొన్ని నెలలపాటు వీరి స్నేహం సాఫీగా సాగింది. వారం రోజులకు ముందు ఇన్‌స్టాగ్రామ్ స్నేహితుడు ఆ విద్యార్థినిని బెదిరించసాగాడు. ఆమె ఫొటోలను మార్ఫింగ్ చేసి నెట్‌లో విడుదల చేస్తానని, తాను చెప్పినట్లు వినాలని భయపెట్టాడు. దీంతో దిగులు చెందిన విద్యార్థిని రెండు రోజులుగా ముభావంగా గడిపింది. ఇంటిలో అక్క, తమ్ముడితోను సరిగా మాట్లాడకుండా ఒంటరిగా ఉండిపోయింది. గురువారం సాయంత్రం కాలేజీ నుంచి తిరిగొచ్చిన ఆ విద్యార్థిని తనగదిలోకి వెళ్ళి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ సమయంలో ఇంటికి చేరుకున్న ఆమె తమ్ముడు గదిలో నుంచి ఎలాంటి అలికిడి వినిపించకపోవడంతో భయపడ్డాడు. అక్కకు ఫోన్ చేయడంతో ఆమె పరుగున ఇంటికి చేరుకుంది. ఇద్దరూ స్థానికుల సహాయంతో గది తలుపులు పగులగొట్టి చూడగా ఆ విద్యార్థిని ఉరివేసుకుని వేలాడుతుండటం చూసి దిగ్భ్రాంతిచెందారు. ఈ సమాచారం అందుకున్న విరుగంబాక్కం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్ళి విద్యార్థిని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు పంపారు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు సైబర్‌క్రైం విభాగం సహాయంతో ఆమెను బెదిరించిన యువకుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.

విద్యార్థినికి లైంగిక వేధింపులు

కేరళ యువకుడి కోసం గాలింపు

ప్యారీస్, జూలై 26: స్థానిక విరుగంబాక్కంలో ఓ విద్యార్థినిని లైంగికంగా వేధించి పరారైన కేరళ యువకుడి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విరుగంబాక్కం ప్రాంతంలోని ఓ ఇంట్లో నివసిస్తున్న విద్యార్థినిని పక్కింట్లో ఉన్న కేరళ రాష్ట్రం త్రివేండ్రంకు చెందిన నందులాల్ గత వారం ఇంట్లో చొరబడి లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు పరారైన నందులాల్ కోసం గాలిస్తున్నారు.

ఇన్‌స్టా రీల్స్ పిచ్చి...!

బైక్ పెట్రోల్ ట్యాంకుపై ప్రియుడు

డ్రైవింగ్ చేసిన ప్రియురాలు ● రూ.13 వేలు అపరాధం

అడయార్, జూలై 26: నేటి యువత ఇన్‌స్టా రీల్స్, మీమ్స్ పిచ్చిలో పడి ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. తాజాగా తిరుపూరు జిల్లా అవినాశిలో ఓ ప్రేమజంట ఇన్‌స్టా రీల్ కోసం ఓ వీడియో చేసి సమస్యల్లో చిక్కుకుంది. తన ప్రియుడిని ద్విచక్రవాహనం పెట్రోల్ ట్యాంకుపై కూర్చోబెట్టి, తాను బైక్ డ్రైవింగ్ చేస్తూ ఓ వీడియో తీయించుకుంది. ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అది కాస్త వైరల్ అయింది. ఈ వీడియోను చూసిన నెటిజన్లు తీవ్ర విమర్శలు గుప్పించారు. పైగా పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్ళింది. దీంతో తిరుపూరు జిల్లా పోలీసులు రంగంలోకి దిగి, ఇన్‌స్టాగ్రామ్ ఐడీ ఆధారంగా ఆ ప్రేమికులను గుర్తించి, రూ.13 వేల అపరాధం విధించడంతో పాటు కేసు కూడా నమోదు చేశారు. ఇన్‌స్టా కోసం వినియోగించిన బైక్ జిల్లాలోని పళంకరై ప్రాంతానికి చెందిన రామర్ అనే వ్యక్తికి చెందినదిగాను, బైకు నడిపిన యువతిని ప్రీతిగా గుర్తించారు. వీరిద్దరూ ఒకే ప్రాంతానికి చెందిన ప్రేమికులని తేల్చారు. లైసెన్సు లేకుండా వాహనం నడపటం, హెల్మెట్ ధరించకుండా ప్రమాదకరరీతిలో బైక్‌పై దూసుకెళ్ళడంతో పాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేయడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకుగాను రూ.13 వేల అపరాధం విధించారు.

బడిపిల్లలను కాపాడి మృతి చెందిన వ్యాన్ డ్రైవర్ కుటుంబానికి రూ.5లక్షలు


వ్యాన్ డ్రైవర్ సేమలయప్పన్ తల్లిదండ్రులకు చెక్ అందజేస్తున్న సమాచార శాఖ మంత్రి సామినాథన్

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా వెల్లకోవిల్‌లో ప్రైవేటు పాఠశాల పిల్లలను కాపాడి మృతి చెందిన వ్యాన్ డ్రైవర్ కుటుంబీకులకు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటన మేరకు రాష్ట్ర సమాచార శాఖమంత్రి సామినాథన్ రూ.5లక్షల చెక్కు అందించారు. వెల్లకోవిల్‌ని ప్రైవేటు పాఠశాలలో కాంగేయం సత్యానగర్‌కు చెందిన సేమలయప్పన్ (49) వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. రోజూ విద్యార్థులను వారిళ్లనుంచి స్కూలుకు, మళ్ళీ స్కూల్ నుంచి ఇళ్ళకు క్షేమంగా వ్యాన్‌లో తీసుకెళ్లేవారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24 సాయంత్రం పాఠశాల నుంచి పిల్లలను వ్యాన్‌లో ఎక్కించుకుని బయలుదేరాడు. మార్గమధ్యంలో పాత పోలీసుక్వార్టర్స్ ప్రాంతం వద్ద వ్యాన్ నడుపుతున్న సేమలయప్పన్‌కు ఆకస్మికంగా గుండెపోటు వచ్చింది. అతను వ్యాన్‌ను నెమ్మదిగా రోడ్డుపక్కగా ఆపి స్టీరింగ్‌పైనే వాలిపోయి మరణించాడు. దీంతో వ్యాన్‌లోని బడిపిల్లలందరూ విలపించారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ వ్యాన్ డ్రైవర్ కుటుంబానికి రూ.5లక్షల సహాయాన్ని ప్రకటించారు. శుక్రవారం ఉదయం సమాచార శాఖ మంత్రి సామినాథన్ కాంగేయం సత్యానగర్‌కు వెళ్ళి వ్యాన్ డ్రైవర్ సేమలయప్పన్ తల్లిదండ్రులు, కుమారులను ఓదార్చి రూ.5లక్షల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ క్రీస్తురాజ్, కార్పొరేషన్ ఫోర్త్ జోనల్ కమిటీ చైర్మన్ ఎల్. పద్మనాభన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ల నియామకాల్లో అవినీతిపై త్వరలో విచారణ కమిటీ ఏర్పాటు

● గవర్నర్ ఆరాతో ప్రభుత్వ నిర్ణయం

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో నకిలీ ఆధార్ కార్డుల ద్వారా ప్రొఫెసర్లు ఉద్యోగాలు పొందిన వ్యవహారంపై ప్రత్యేక విచారణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ అవినీతిపై తనకు నివేదిక సమర్పించమంటూ గురువారం గవర్నర్ ఆర్ఎన్ రవి అన్నా వర్శిటీ నిర్వాహకులకు ఆదేశాలిచ్చిన సంగతి తెలిసిందే. గవర్నర్ రవి ఆదేశాల మేరకు ఈ అవినీతిపై సేకరించిన సమాచారాన్ని నివేదిక తయారు చేసి ఒకట్రెండు రోజుల్లో ఆయనకు పంపనున్నారు. అదే సమయంలో ఈ అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విచారణ కమిటీ ఏర్పాటు చేయడాన్ని సన్నద్ధమవుతోంది. ఆ కమిటీకి సాంకేతిక విద్యా మండలి కమిషనర్‌ను నాయకత్వం వహించనున్నారని తెలుస్తోంది.

కల్తీ సారా వ్యాపారుల బ్యాంక్ ఖాతాల స్తంభన

ప్యారీస్, జూలై 26: రాష్ట్రంలో కలకలం రేపిన కళ్లకుర్చి కల్తీ సారా దుర్ఘటన ఎఫెక్ట్ వల్ల రాష్ట్రంలో 466 మంది కల్తీ సారా వ్యాపారుల బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేసినట్లు రాష్ట్ర ఎక్సైజ్ విభాగం అధికారులు తెలిపారు. కళ్లకుర్చి కరుణాపురంలో ఇటీవల కల్తీ సారా తాగి 68 మంది మృతిచెంద గా, 150 మందికి పైగా అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం ఈ కేసు విచారణను సీబీసీఐడీ పోలీసులు ముమ్మరం చేశారు. ప్రధాన నిందితులైన కల్తీ సారా వ్యాపారులు గోవిందరాజ్ సహా 20 మందికి పైగా అరెస్ట్ చేశారు. కలకలం రేపిన కళ్లకుర్చి ఘటనపై దృష్టి సారించిన ప్రభుత్వం, కల్తీ సారా నివారణ చర్యలు చేపట్టింది. ఈ పనులు నిర్వహిస్తున్న పోలీసులు, తొలివిడతగా రాష్ట్రంలోని నార్త్ జోన్ పరిధిలో ఉన్న 10 జిల్లాల్లో 466 మంది కల్తీ సారా వ్యాపారులు, వారి బంధువుల బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేశారు. ఇందులో విల్లుపురం జిల్లాలో 98 మంది, తిరువణ్ణామలై 77, కడలూరు 71, చెంగల్పట్టు 56, రాణిపేట 44, తిరుపత్తూర్ 41, వేలూరు 33, కాంచీపురం 21, కళ్లకుర్చి 13, తిరువళ్లూర్ 12 మంది బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేసినట్లు ఐజీ ఆశ్రా కార్గ్ శుక్రవారం మీడియాకు తెలిపారు.

కొడనాడు హత్య కేసు విచారణ వాయిదా

అడయార్, జూలై 26: కొడనాడు ఎస్టేట్ సెక్యూరిటీ గార్డు హత్య, దోపిడీ కేసు విచారణ వచ్చే నెల 30వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. మాజీ ముఖ్యమంత్రి దివంగత జయలలితకు చెందిన కొడనాడు ఎస్టేట్‌లో 2017 ఏప్రిల్ 23వ తేదీన సెక్యూరిటీ గార్డును హత్య చేసి, ఎస్టేట్‌లో దోపిడీ జరిగింది. ఈ కేసులో మొత్తం 10 మందిని పోలీసులు అరెస్టు చేయగా, గత ఐదేళ్ళుగా ఈ కేసు విచారణ నీలగిరి జిల్లాలోని ఊటీ కోర్టులో కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ కేసు విచారణకు రాగా, నిందితులతో పాటు ప్రభుత్వ న్యాయవాది కూడా హాజరయ్యారు. అయితే, కేసు విచారణను ఆగస్టు 30వ తేదీకి వాయిదా వేస్తూ న్యాయమూర్తి అబ్దుల్ ఖాదర్ ఆదేశించారు.

ట్యూషన్‌కు వచ్చిన బాలుడితో టీచర్ లీలలు

● పోక్సో చట్టం కింద అరెస్టు

అడయార్, జూలై 26: తన వద్ద ట్యూషన్ కోసం వచ్చే 15 యేళ్ళ బాలుడిని లోబరుచుకుని శారీరక సంబంధం పెట్టుకున్న 24 యేళ్ళ టీచర్‌ను శివకాశి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. విరుదునగర్ జిల్లా శివకాశి ప్రాంతానికి చెందిన మహిళ(24)కు వివాహమైన కొన్ని నెలలకే భర్తతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఒంటిరిగా ఉంటోంది. అయితే, ఈమె తన నివాసంలోనే ఒకటి నుంచి ప్లస్‌టూ వరకు ట్యూషన్ చెపుతుండటంతో అనేక మంది విద్యార్థులు ఆమె ఇంటికి వచ్చేవారు. ఈ క్రమంలో 15 యేళ్ళ బాలుడిని మాయమాటలతో లోబరుచుకుని శారీరక సంబంధం పెట్టుకుంది. కాలక్రమంలో ఆ బాలుడి ప్రవర్తనలో మార్పును గుర్తించిన తల్లిదండ్రులు నిలదీయడంతో జరిగిన వాస్తవం చెప్పాడు. దీంతో బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శివకాశి ఈస్ట్ పట్టణ పోలీసులు టీచర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఫ్లైఓవర్ నుంచి దూకి యువకుడి ఆత్మహత్య



సంఘటన స్థలంలో పోలీసులు - వేల్‌రాజ్ మృతదేహం

చెన్నై, జూలై26(ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని కత్తిపారా ఫ్లైఓవర్ నుంచి కిందకు దూకి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం పది గంటల సమయంలో వడపళని మార్గంలో బైకులో వచ్చిన యువకుడు ఆ ఫ్లైఓవర్ పోరూరు మలుపు వద్ద వాహనం ఆపి, ఉన్నట్లుండి కిందకు దూకాడు. రోడ్డుపై పడిన ఆ యువకుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. ఆ యువకుడి జేబులో లభించిన గుర్తింపు కార్డును బట్టి అతడి పేరు వేల్‌రాజ్ (23), విరుగంబాక్కం కృష్ణానగర్‌కు చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

కూటమి ధర్మాన్ని విస్మరించకండి

● ఎంపీ కార్తీ చిదంబరానికి మంత్రి పెరియస్వామి చురక

ప్యారీస్, జూలై 26: కూటమి ధర్మాన్ని విస్మరించి డీఎంకేను విమర్శించడం సరికాదని దిండుగల్ కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరంను ఉద్దేశించి మంత్రి పెరియస్వామి మందలింపు ధోరణిలో వ్యాఖ్యానించారు. ఇటీవల కాంగ్రెస్ శ్రేణులనుద్దేశించి మాట్లాడిన కార్తీ చిదంబరం... డీఎంకే కూటమి లో ఉన్నందువల్ల కాంగ్రెస్ బానిసలా లొంగిపోవాల్సిన అవసరం లేదని మాట్లాడడం చర్చనీయాంశమైంది. దీనిపై స్పందించిన మంత్రి పెరియస్వామి గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో 40 నియోజకవర్గాల్లో పోటీచేసి అన్ని స్థానాలను కైవసం చేసుకొని రికార్డు సృష్టించిన విషయాన్ని ఎంపీ కార్తీ చిదంబరం అంతలోనే మర్చిపోవడం హాస్యాస్పదమన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు అన్నాదురై, కరుణానిధి, సీఎం స్టాలిన్ శ్రమ, కృషి వల్లే నేడు డీఎంకే అతిపెద్ద పార్టీగా నిలదిక్కుకోగలిగిందన్నారు. ఈ నేపథ్యంలో, ఈరోడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ కూడా కార్తీ చిదంబరం మాటలను తప్పుపట్టారు. డీఎంకే కూటమిలో ఉండడం వల్లే కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్న వాస్తవాన్ని మరుగుపరచి డీఎంకేను విమర్శించడం తమలాంటి సీనియర్లు జీర్ణించుకోలేక పోతున్నారని తెలిపారు.

ఒక చిన్న ప్రేరణ మనిషి జీవితంలో పెనుమార్పులు తెస్తుంది. జీవితంలో... జీవన విధానంలో ఎన్నో పరిణామాలకు దారితీ స్తుంది. ఆలోచనల్లో... ఆచరణలో పరిణితి తెస్తుంది. ప్రేరణకంత శక్తి ఉంది. ఆ శక్తే ఆమెను గృహిణి నుంచి వ్యాపారవేత్తగా ఎదిగేం దుకు ఆస్కారమయింది. ఆటువంటి శక్తి స్వరూపిణి వ్యాపారవేత్తగా 'విజయ' పథంలో దూసుకుపోతున్న వర్ధమాన వ్యాపారవేత్త కె.విజయశ్రీ కిరణ్ నేటి తరుణిలో...

- వేళచ్చేరి


విజయశ్రీ

" ఆమె ఒక సాధారణ గృహిణి. భర్త, పిల్లలు, కుటుంబం సర్వస్వంగా భావించేవారు. ఇంటి గడప దాటని ఆమెలో భర్త అనూహ్యంగా ఒక మార్పు తెచ్చారు. 'కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడం ముఖ్యమే కానీ నీ కంటూ సొంత వ్యక్తిత్వం ఉండాలి. ఒక వ్యాపకం ఏర్పరచుకోవాలి. నీ సామర్థ్యాన్ని వెలికితీసి నిన్ను నువ్వు నిరూపించుకోవాలి. అని ఆయన ప్రోత్సహించి చెప్పిన మాటలు ఆమెలో మార్పు తెచ్చి వ్యాపారం దిశగా అడుగులు వేయించాయి. ఒక కంపెనీకి డైరెక్టర్‌గా ఎదిగే స్ఫూర్తినిచ్చాయి'.

భర్త ప్రోత్సాహం... వ్యాపార రంగంలో విజయం

● గృహిణి నుంచి.... వ్యాపారవేత్తగా మారిన విజయశ్రీ కిరణ్



విజయశ్రీ జన్మించింది చెన్నైలో. తల్లి ప్రభావతి. గృహిణి. తండ్రి నరసింహమూర్తి రైల్వే ఉద్యోగి. ఒక సోదరుడు ఉన్నారు.కీల్పాక్కంలోని బెయిన్స్ స్కూలులో 12వ తరగతి వరకు చదివారు. తర్వాత హిందూ కాలేజి నుంచి బికామ్ డిగ్రీ పొందారు.

కుటుంబం: భర్త కిరణ్. హైస్టైల్ కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్. ఈ దంపతులకు ఇద్దరు సంతానం.


భర్త కిరణ్‌తో...


కుటుంబసభ్యులతో

అభిరుచులు: విజయశ్రీకి సంగీతం, భరత నాట్యం ఇష్టమైనవి. పదేళ్ల పాటు భరతనాట్యం నేర్చుకోవడమేగాక ప్రదర్శనలు కూడా ఇచ్చేవారు. వీణ కూడా కొన్నేళ్ల పాటు నేర్చుకొని సాధన చేశారు. తోట పని ఆమెకు మరింత ఆసక్తి కలిగించే అభిరుచి. సమాజంలో అందరితో కలసిమెలసి ఉండడం ఎక్కువగా ఇష్టపడతారు.

వ్యాపార ప్రస్థానం..

వ్యాపారవేత్త కావాలన్న కోరికకు ఆమె భర్త అంకురార్పణ చేశారు. ఇంటి గడప దాటని ఆమె వ్యాపారంలో ప్రవేశించారు. 1986వ సంవత్సరంలో అన్నానగర్‌లో

అవార్డులు...

విజయశ్రీ రోటరీ క్లబ్ నుంచి 'బెస్ట్ ఉమన్ ఎంటర్‌ప్రన్యూర్' అవార్డు అందుకున్నారు. రిటైల్ ఇండస్ట్రీ నుంచి కూడ బెస్ట్ ఉమన్ ఎంటర్‌ప్రన్యూర్ అవార్డు గ్రహించారు. రోటరీ క్లబ్ సభ్యురాలైన విజయశ్రీ సమాజసేవలో పాలు పంచుకుంటున్నారు. జీవన సహచరుడి స్ఫూర్తితో వ్యాపారంలో అడుగుపెట్టినా, ఆపె తన స్వశక్తితో చేసే పనిని ప్రేమిస్తూ, ప్రతి నిమిషం ఆ పని ఇంకా బాగా చేసేందుకు మార్గాలు అన్వేషిస్తూ విజయం వైపు ప్రయాణం సాగిస్తున్నారు విజయశ్రీ.

తరుణి


రోటరీ క్లబ్ ఫ్యాషన్ షోలో...

విజయశ్రీ భర్త ఒక 'మెన్స్ గార్మెంట్ షాప్' ప్రారంభించారు. నాలుగంతస్తుల భవనంలో క్రమేణా ఒక అంతస్తులో పురుషులకు ప్రత్యేకమైన దుస్తులు, రెండో అంతస్తులో పిల్లలకు ప్రత్యేకమైనవి. మూడో అంతస్తులో స్త్రీల దుస్తులు ఉండేవి. భర్త ప్రేరణతో వ్యాపారంలో అడుగుపెట్టిన విజయశ్రీ ఆ భవనంలోని నాలుగవ అంతస్తులో 'చీరలు' మాత్రమే ప్రత్యేకంగా ఉంచాలని భావించారు. అలా 'హైస్టైల్ గ్రూప్'లో నాలుఓ ఫ్లోర్‌కి శ్రీకారం చుట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన చీరలన్నీ ఒక్క దగ్గరే లభించే అవకాశాన్ని కల్పించారు. బిజినెస్ మూలంగా ముంబై, కొల్‌కత్తా, కోయంబత్తూరు, వారణాసి తదితర ప్రాంతాలకు ఆమె ఒంటిరిగానే వెళ్లి కొనుగోలు చేసే అనుభవాన్ని సంపాదించారు విజయశ్రీ. నేర్పుగా, ఓర్పుగా ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూ వ్యాపారంలో ముందంజ వేస్తూ, 'దివ' స్టోర్‌కి నాంది పలికారు. యజమాని క్రమశిక్షణతో, సమయపాలనతో, అంకిత భావంతో పనిచేస్తుంటే కింద పనిచేసే ఉద్యోగులు కూడా అవే విలువలకు కట్టుబడి ఉంటారని ఆమె భావిస్తారు. ఆమె కృషివల్లే 'దివా స్టోర్' చెన్నైలో కెథడ్రల్ రోడ్, స్టెర్లింగ్ రోడ్డు, అన్నానగర్‌లో తన శాఖలను విస్తరించింది. హై స్టైల్ గ్రూప్ పాండిచ్చేరి, కోయంబత్తూర్, అంబత్తూరు, అన్నానగర్‌లను వ్యాపించింది. 'హై స్టైల్ ప్రైవేట్ లిమిటెడ్' కంపెనీకి విజయశ్రీ డైరెక్టర్‌గా ఎదిగారు. ఈ వ్యాపార ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు, కష్టసుఖాలు ఎదురైనా అన్నిటినీ అధిగమించి విజయాలను అందుకుంటున్నారు విజయశ్రీ. కుమారులు కూడా ఈ వ్యాపారంలో చేయూతనిస్తున్నారు. చిన్న కుమారుడు ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు చేయడంతో 'టెయిలర్డ్' అనే స్టిచింగ్ శాఖ కూడా ప్రారంభించి సూట్, సఫారి వగైరా పురుషుల బట్టలకు డిజైనింగ్ చేస్తూ వ్యాపారాభివృద్ధికి మరింత దోహదం చేస్తున్నారు. సీఏ చేసిన పెద్ద కోడలు కంపెనీ అకౌంట్స్ చూస్తుండడంతో కుటుంబం మొత్తం వ్యాపారాభివృద్ధికి ఒకరికొకరు అండగా నిలుస్తూ ఆదర్శనంగా ఉన్నారు.

"ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించాలి. పనిచేస్తున్నప్పుడు కలిగే ఆత్మసంతృప్తి ఆత్మవిశ్వాసానికి దారి తీస్తుంది. స్వతంత్రంగా ఎదిగి, స్వశక్తితో ముందుకు సాగాలి. ఇంటి పని, ఉద్యోగం రెండూ సమన్వయం చేసుకున్నప్పుడు ఒత్తిడికి తావుండదు. ఏ పనిచేసినా క్రమశిక్షణ, సమయపాలన ముఖ్యమని గుర్తించాలి". అంటూ విజయశ్రీ 'తరుణి'తో తన అభిప్రాయాలను పంచుకున్నారు.

వీఐటీ, వోల్వో ఇండియా మధ్య ఒప్పందం



అవగాహన ఒప్పందం కార్యక్రమంలో వీఐటీ ఛాన్సలర్ విశ్వనాధన్, వోల్వో ఇండియా ప్రతినిధులు

వేలూరు, జూలై 26: వోల్వో గ్రూప్ ఇండియా సంస్థ ద్వారా స్మార్ట్ మొబిలిటీ (ఎంటెక్) పాఠ్యాంశం ప్రారంభించేందుకు వీఐటీ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా వోల్వో సంస్థ, శిక్షణ, ఉద్యోగాల కల్పనలో వీఐటీ విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వనుంది. అలాగే, స్మార్ మొబిలిటీ కోర్సు అబివృద్ధికి ప్రముఖ పాత్ర పోషించనుంది. ఇక, వోల్వో గ్రూప్ ఇండియా సీఎస్ఆర్ ఫౌండేషన్, వీఐటీలో బీటెక్ చదివే ఐదుగురు విద్యార్థినులకు (2024-28) నాలుగేళ్ల మొత్తం ట్యూషన్ ఫీజు భరిస్తుంది. బీటెడ్ మెకానికల్ ఇంజనీరింగ్, బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ (ఎలక్ట్రిక్ వాహనాలు), బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ (మాన్యుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్) పాఠ్యాంశాల్లో అధ్యయనం చెయ్యొచ్చు. వీఐటీ వర్సిటీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో వీఐటీ ఫౌండర్, ఛాన్సలర్ డా.కె.విశ్వనాథన్, వోల్వో గ్రూప్ ఇండియా సీఎస్ఆర్ డైరెక్టర్ జీవీ రావు, వీఐటీ వైస్ ఛాన్సలర్లు శంకర్ విశ్వనాథన్, డా.జీవీ సెల్వం, వైస్ ఛాన్సలర్ డా.వి.కాంచన భాస్కరన్, అసోసియేట్ వైస్ ఛాన్సలర్ డా.పార్థసారధి మల్లిక్, రిజిస్ట్రార్ డా.జయభారతి, మానవవనరుల అభివృద్ధి వోల్వో హెడ్ డా.డీపీ రంజిత్ సమక్షంలో వోల్వో మానవవనరుల అభివృద్ధి విభాగం మేనేజర్ ప్రభు కృష్ణన్ ఎంఓయూపై సంతకాలు చేసి ఒప్పందాలు మార్చుకున్నారు.

లాభాల బాటలో సీయూబీ రూ. 264 కోట్లకు పెరిగిన నికర ఆదాయం

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో సిటీ యూనియన్ బ్యాంక్ నికర ఆదాయం రూ. 227 కోట్ల నుంచి రూ.264 కోట్లకు పెరిగినట్లు ఆ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. కామకోడి తెలిపారు. శుక్రవారం ఉదయం జరిగిన బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ఆమోదించినట్లు పేర్కొన్నారు. బ్యాంక్ వడ్డీయేతర రాబడి రూ.191 కోట్ల నుంచి రూ.192 కోట్లకు చేరిందన్నారు. ఇక నికర వడ్డీ రాబడి కూడా రూ. 5.23 కోట్ల నుండి రూ.545 కోట్లకు పెరిగినట్లు వివరించారు. బ్యాంక్ డిపాజిట్లు కూడా 6 శాతానికి పెరిగి 54,857 కోట్లకు చేరిందని తెలిపారు. బ్యాంక్ మంజూరు చేసిన రుణాలు కూడా 10 శాతం పెరిగి రూ.46,548 కోట్లకు చేరిందని తెలిపారు.



సిటీ యూనియన్ బ్యాంక్ ఎండీ డాక్టర్ ఎన్.కామకోడి

కొళత్తూరులో మంత్రి శేఖర్‌బాబు పర్యటన

● అభివృద్ధి పనుల పరిశీలన

చెన్నై, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొళత్తూరు నియోజకవర్గంలో చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ (సీఎండీఏ) ఆధ్వర్యంలో చేపడుతున్న నిర్మాణ పనులను ఆ సంస్థ అధ్యక్షుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు శుక్రవారం ఉదయం అధికారులతో పరిశీలించారు. కొళత్తూరు అగరం ప్రాంతంలోని జగన్నాథన్ వీధిలో కొళత్తూరు డయాలసిస్ సెంటర్ నిర్మాణ పనులను, రూ.2 కోట్లతో నిర్మిస్తున్న కో-వర్కింగ్ స్పేస్‌ను, కొళత్తూరు రెడ్‌హిల్స్ రోడ్డులో రూ.23.50 కోట్లతో నిర్మించనున్న కొళత్తూరు మాడ్రన్ మార్కెట్ ప్రాంతాన్ని, అదే ప్రాంతంలో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణ పనులను ఆయన పరి శీలించారు. మంత్రితోపాటు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్. ప్రియ, గృహ వసతి నగరాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాకర్ల ఉషా, సీఎండీఏ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా, కార్పొరేషన్ కమిషనర్ జే కుమార గురుబరన్, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ జక్డే, రిజిస్ట్రేషనల శాఖ అధ్యక్షుడు పొన్‌రాజ్ అలీవర్ తదితరులు పర్యటించారు.


సీఎండీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న పునరావాస కేంద్రం రక్త శుద్ధీకరణ కేంద్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

విజయవంతంగా అదనపు దంతాల తొలగింపు

● సవీత ఆస్పత్రి వైద్యుల ఘనత

అడయార్, జూలై 26: నగరంలోని సవీత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్‌కు చెందిన సవీత డెంటల్ కాలేజీ, హాస్పిటల్ వైద్యులు అరుదైన ఘనత సాధించారు. 17 యేళ్ళ బాలికకు అదనంగా వచ్చిన 22 దంతాలను ఆపరేషన్ ద్వారా విజయవంతంగా తొలగించారు. ఆ బాలిక గత కొంతకాలంగా సూపర్‌న్యూమరీ దంతాలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చింది. ఆమెకు వైద్యులు ఎక్స్‌రే తీసి పరిశీలించగా, ఎముకలో 22 అదనపు దంతాలు వచ్చినట్టు గుర్తించారు. దీంతో ఓరల్, మాక్సిల్లోఫేషియల్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ రూబిన్ ఎస్.జాన్, డాక్టర్ గౌతమ్ విజయకుమార్ నేతృత్వంలోని వైద్య బృందం ఆపరేషన్ చేసి ఆ బాలికకు ఉన్న 22 అదనపు దంతాలను తొలగించింది. ఈ సంఖ్యలో దంతాలు రావడం అసాధారణమని, ఆపరేషన్ చేసి విజయవంతంగా దంతాలను తొలగించడం అరుదైన విషయంగా వైద్యులు వెల్లడించారు.



అంధగన్' రీమేక్ కాదు.. రీమేడ్

● దర్శకుడు త్యాగరాజన్

చిత్రజ్యోతి

టాప్‌స్టార్ ప్రశాంత్ - ప్రియా ఆనంద్ జంటగా నటించిన 'అంధగన్' చిత్రం రీమేక్ కాదని.. రీమేడ్ అని ఆ చిత్ర దర్శక నిర్మాత త్యాగరాజన్ పేర్కొన్నారు. హిందీలో సూపర్ హిట్ అయిన 'అంధధున్' చిత్రాన్ని స్టార్ మూవీస్ పతాకంపై తమిళంలో తెరకెక్కించారు. వచ్చే నెల 15వ తేదీ విడుదల చేయనున్న ఈ మూవీ ప్రమోషన్స్ ప్రారంభించారు. ఇందులోభాగంగా 'అంధగన్ అంతం' పేరుతో సాగే ప్రొమో సాంగ్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ ప్రభుదేవా నృత్యం సమకూర్చగా, సంగీత దర్శకుడు అనిరుధ్ ఆలపించారు. ఈ పాట నగరంలో రిలీజ్ చేశారు. ఇందులో ప్రశాంత్, ప్రియా ఆనంద్, త్యాగరాజన్, దర్శక నటుడు కేఎస్ రవికుమార్, నటి ఊర్వశి, నటి వనిత, నటుడు చిత్రాలక్ష్మణన్ తదితరులు పాల్గొన్నారు. దర్శకుడు త్యాగరాజన్ మాట్లాడుతూ, '2019లో తీవ్రపోటీ మధ్య ఈ సినిమా రైట్స్ సొంతం చేసుకున్నాను. కరోనాతో పలు కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగింది. నటి సిమ్రన్ నెగెటివ్ షేడ్‌లో నటించారు. నటి వనితా విజయకుమార్‌కు ఓ మంచి చిత్రంగా నిలుస్తుంది. గయ్యాళి భార్యగా నటుడు సముద్రఖని జంటగా నటించారు. సీనియర్ నటుడు కార్తీక్ ఓ చిన్న పాత్రలో కనిపిస్తారు. ఈ సినిమాలో వచ్చే ప్రతి చిన్న పాత్ర కథకనుగుణంగా చిత్రీకరించాం. యోగిబాబుకు సోదరిగా నటి ఊర్వశి నటించారు. ఆమె నాతో కలిసి కొన్ని చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు. ఊర్వశి, యోగిబాబు, కేఎస్ రవికుమార్, సముద్రఖని, ప్రశాంత్, సిమ్రన్, ప్రియా ఆనంద్, కార్తీక్ ఇలా ఎంతో మంది నటులు ఇందులో నటించారు. హిందీ వెర్షన్‌లో లేని అనేక అంశాలు తమిళంలో ఉన్నాయి. అందుకే ఇది రీమేక్ కాదు.. రీమేడ్ అని అన్నారు. హీరో ప్రశాంత్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ప్రొమో సాంగ్ విడుదల చేసిన నటుడు విజయ్‌కు ధన్యవాదాలు. అడగ్గానే ఆయన పెద్దమనసుతో అంగీకరించారు. సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు ఎంతో ఎంజాయ్ చేస్తారు. అలాంటి తరుణం కోసం నేను ఎదురుచూస్తున్నానన్నారు. కేఎస్ రవికుమార్, ఊర్వశి, ప్రియా ఆనంద్, వనిత తదితరులు ప్రసంగించారు.


నటి ఊర్వశిని సన్మానిస్తున్న త్యాగరాజన్, ప్రశాంత్

'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' ఫస్ట్‌లుక్ రిలీజ్

హీరో ప్రదీప్ రంగనాథన్ పుట్టినరోజును పురస్కరించుకుని, ఆయన హీరోగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' (ఎల్ఐకే) ఫస్ట్‌లుక్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ పరిశీలిస్తే లవ్, బ్రేకప్ వంటి అంశాలతో రూపొందించినట్లుగా కనిపిస్తుంది. దీనిని ధ్రువీకరించేలా పోస్టర్‌లోని ఓ భవనంపై 'బ్రేకప్ క్లెయిమ్ పెనాల్టీ' అని రాసివుంది. ప్రదీప్ రంగనాథన్ ఫోన్ టచ్ చేస్తున్నట్లుగా ఉన్న లుక్ అందరిని ఆకర్షించింది. విఘ్నేష్ శివన్ దర్శకత్వం వహించిన చిత్రాల్లో ఒక్క సినిమా మినహా మిగిలిన చిత్రాలన్నీ ప్రేమ నేపథ్యంలో తెరకెక్కినవే. ఈ సినిమా కూడా ఆ బాణీలోనే రూపొందిస్తున్నారు. 7 స్క్రీన్ స్టూడియో బ్యానరుపై లలిత్ కుమార్ రౌడీ పిక్చర్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇందులో ఎస్‌జే సూర్య, సీమాన్, కృతిశెట్టి, యోగిబాబు, ఆనంద్ రాజ్, మాళవిక, సునీల్ రెడ్డి తదితరులు నటించారు. సత్యన్ సూర్యన్ సినిమాటోగ్రఫీ, అనిరుధ్ సంగీతం సమకూర్చిన. ఈ సినిమాను నేటి యువత ప్రేమకథతో పూర్తిస్థాయి హాస్యభరితంగా నిర్మిస్తున్నారు. ఇదిలా వుండగా గతంలో ఈ చిత్రం పేరును 'ఎల్ఐసీ'గా ఖరారు చేయగా, జీవిత బీమా సంస్థ నుంచి అభ్యంతరం రావడంతో ఆ పేరును ఎల్ఐకేగా మార్చారు.


'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' ఫస్ట్‌లుక్ రిలీజ్

శృతిహాసన్ సినీ కెరీర్‌కు 15 వసంతాలు

విశ్వనటుడు కమల్ హాసన్ వారసురాలిగా చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన శృతి హాసన్ మల్టీటాలెంటెడ్ నటిగా రాణిస్తున్నారు. నటిగా, గాయనిగా, సంగీత దర్శకురాలిగా ఆమె తన ప్రస్థానాన్ని కొనసాగిస్తూ, 15 యేళ్ళ సినీ కెరీర్‌ను పూర్తి చేసుకున్నారు. 2009లో హిందీలో 'లక్' అనే చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఈ సినిమాతో ఆమెకు అదృష్టం వరించలేదు. అయినప్పటికీ తెలుగు, తమిళ పరిశ్రమల్లో అవకాశాలు వచ్చాయి. తెలుగులో అయితే, ఒక దశలో ఐరెన్ లెగ్ అనే ముద్ర కూడా వేసుకుంది. కానీ, పవన్ కళ్యాణ్ నటించిన 'గబ్బర్ సింగ్' సినిమా ఆమె సినీ కెరీర్‌ను మలుపుతిప్పింది అప్పటి నుంచి వరుస విజయాలు సొంతం చేసుకుంటూ దక్షిణాదిలో అగ్రహీరోయిన్‌గా రాణిస్తోంది. ఇపుడు తన 15 యేళ్ళ సినీ కెరీర్‌పై శుక్రవారం ఓ ట్వీట్ చేశారు. '15 యేళ్లు పూర్తికావడాన్ని నమ్మలేకపోతున్నా. నేను ప్రత్యక్షంగా చూస్తూ పెరిగిన మాయా ప్రపంచంలో ఒక నటిగా ఉండటం భాగ్యంగా భావిస్తున్నాను. ఇన్నేళ్ళలో ఎన్నో చిత్రాలు, అభిమానులను ఇచ్చిన పరిశ్రమకు కృతజ్ఞతలు. అభిమానులు లేకుండా ఖచ్చితంగా ఇంతవరకు వచ్చి ఉండేదాన్ని కాదు. ప్రేమతో మీ శృతి' అని పేర్కొన్నారు.




సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి పతకాలను చూపుతున్న రూబిక్స్ క్యూబ్ పోటీ విజేత, ఆసియా రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించుకున్న చిన్నారి ఎం.లక్షిత


సచివాలయంలో రాష్ట్ర రహదారులు, మినీ ఓడరేవుల శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల్లో వంతెనల నిర్మాణ పద్ధతులపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



శుక్రవారం జరిగిన చెన్నై వేళచ్చేరిలో వున్న గురునానక్ కాలేజీ 48వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు

అమ్మవారి ఆలయాల్లో ఆడి శుక్రవార పూజలు

ప్యారీస్, జూలై 26: రాష్ట్రంలో అమ్మవార్లు కొలువుదీరిన ఆలయాల్లో ఆడి మాసం రెండో శుక్రవారం సందర్భంగా వైభవంగా నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులను ఆలయాల అధికారులు దర్శనానికి అనుమతించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్ నగరం నుంచి విమానంలో తిరుచ్చి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో ఉరయూరులో ప్రసిద్ధిచెందిన వైకాలి అమ్మవారి ఆలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. అనంతరం పంచభూత స్థలాల్లో జలస్థలమైన జంబుకేశ్వర, అఖిలాండేశ్వరి ఆలయానికి వెళ్లారు. ఆ తర్వాత శక్తి స్థలాల్లో ప్రసిద్ధిచెందిన సమయపురం మారియమ్మన్ ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గా స్టాలిన్ పర్యటన నేపథ్యంలో ఆమె సందర్శించిన ఆలయాల్లో పోలీసు భద్రత పటిష్టం చేశారు.


వైకాలి అమ్మవారి ఆలయంలో దుర్గా స్టాలిన్